మహిళలకే నిర్ణయ హక్కు: పీఓడబ్ల్యూ సంధ్య

చాదర్‌ఘాట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు తాము ఎలా జీవించాలో నిర్ణయం తీసుకునే హక్కు వారికే ఉండాలని, అప్పుడే మహిళలు అన్ని రంగాల్లో రాణించగలుగుతారని పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్య అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని సిద్ధార్థ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో 'మహిళల నిర్ణయాధికారం ఎంపిక హక్కు' అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ, కుటుంబ సంబంధాలు ప్రజాస్వామికంగా ఉండాలని, అలా లేని కుటుంబాల్లో హింస చోటు చేసుకుంటుందని అన్నారు. అనంతరం సదస్సుల్లో విద్యార్థులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ అధ్యక్షురాలు అనసూయ, కళాశాల ప్రిన్సిపాల్ త్రివేణి, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి భారతి, రేణుక, రాణి తదితరులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ కేబుల్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

● ఎమ్మెల్యే అహ్మద్ బలాల

చాదర్‌ఘాట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నియోజకవర్గంలోని విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు అండర్ గ్రౌండ్ కేబుళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. శుక్రవారం ఆయన టీజీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) నర్సింలుతో 33కేవీ, 11కేవీ విద్యుత్ లైన్స్‌ను అండర్ గ్రౌండ్ కేబుల్స్‌గా మార్చేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మలక్‌పేట నియోజకవర్గంలోని విద్యుత్ తీగలన్నింటిని అండర్ గ్రౌండ్ కేబుల్స్‌గా మార్చేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సమీక్షా సమావేశంలో విద్యుత్ మాస్టర్ ప్లాన్స్ డీఈ శ్రీధర్, ఏడీఈ కైలాష్, ఆస్మాన్‌ఘడ్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, సీబీడీ ఏడీఈ శ్రీధర్ పాల్గొన్నారు.



సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

డివిజన్ అభివృద్ధికి కృషి: కార్పొరేటర్

చంపాపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి తెలిపారు. చంపాపేట డివిజన్‌లోని క్రాంతినగర్ కాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.60లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీలు, బస్తీలలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

● సీపీఎం నాయకుడు నర్సిరెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బస్తీ వాసులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సీపీఎం హయత్‌నగర్ సర్కిల్ కార్యదర్శి కీసరి నర్సిరెడ్డి అధికారులు, ప్రభుత్వాన్ని కోరారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లోని అజ్మాయిగూడ దళిత బస్తీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ, డ్రైనేజ వ్యవస్థ సరిగా లేక ఇటీవల కురిసిన వర్షాలకు అజ్మాయిగూడ దళిత బస్తీలో మురుగునీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు పలు మార్లు వినతిపత్రాలు అందజేసిన ఎలాంటి ఫలితం లేదన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు చేపడుతామని నర్సిరెడ్డి హెచ్చరించారు. సీపీఎం నాయకులు గణేష్‌గౌడ్, శ్రీనివాస్, కృష్ణశేఖర్, ఆనంద్, సుశీల, సుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.



చలో హైదరాబాద్ మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ అనంతరం నినాదాలు చేస్తున్న యూఎస్‌పీసీ నాయకులు

సీపీఎస్‌ను రద్దు చేయాలి: యూఎస్‌పీసీ నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూఎస్‌పీసీ పిలుపు మేరకు శనివారం నిర్వహించనున్న చలో హైదరాబాద్ మహాధర్నా పోస్టర్‌ను శుక్రవారం కవాడిపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన మహాధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రాములయ్య, జిల్లా కార్యదర్శి భువనేశ్వరి, ఇన్‌చార్జి హెచ్‌ఎం జయప్రకాష్, శ్రీనివాస్, వెంకటయ్య, వెంకటేష్, సునీత, దీపిక పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

చాదర్‌ఘాట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి రోడ్డు పక్కన మృతి చెందాడు. ఈ సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. చాదర్‌ఘాట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట కాలాడేరకు చెందిన జహంగీర్ (40) భిక్షాటన చేసి జీవనం సాగిస్తున్నాడు. మలక్‌పేట ఆర్‌యూబీ వద్ద శుక్రవారం పడి ఉండడాన్ని స్థానికులు గమనించి చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నట్లుగా గుర్తించారు. మృతుడు కాలాడేరకు చెందిన జహంగీర్‌గా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పెట్టుబడుల పేరుతో మోసం.. ఇద్దరి అరెస్ట్



నిందితులు సురేష్, ఖాన్‌రియాజ్

మన్సూరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడుల పేరుతో అమాయకుల వద్ద నుంచి డబ్బులు కాజేస్తూ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరిని నాగోల్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా వేంకటగిరికోటకు చెందిన ఖాన్‌రియాజ్ నగరంలోని మణికొండలో నివాసముంటున్నాడు. చిక్కడపల్లికి చెందిన సురేశ్‌తో కలిసి నాగోల్ చౌరస్తా వద్ద మామ మెటల్స్ పేరుతో 2024లో ఓ వ్యాపారాన్ని ప్రారంభించారు. రూ.లక్ష పెట్టుబడి పెడితే రోజుకు రూ.2వేలు వంద రోజుల పాటు ఇస్తామంటూ రెట్టింపు లాభాన్ని ఆశ చూపారు. అదే విధంగా దుబాయ్ నుంచి బంగారం తెచ్చి తక్కువ ధరకు ఇస్తామంటూ పలువురు అమాయకులను నమ్మించారు. ఇటీవల వీరిద్దరు కనిపించకపోవడంతో వీరిని నమ్మి రూ.75వేలు పెట్టుబడి పెట్టిన అబ్దుల్ రజాక్ అనే బాధితుడు మోసపోయానని గ్రహించి గురువారం నాగోల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి శుక్రవారం మణికొండలో ఖాన్‌రియాజ్, చిక్కడపల్లిలో సురేష్‌లను ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో ఆరు మంది బాధితుల వద్ద సుమారు రూ.కోటి తీసుకున్నట్లు వారు నేరాన్ని అంగీకరించారు. అనంతరం వారిద్దరిని న్యాయస్థానంలో హాజరు పర్చగా న్యాయమూర్తి తీర్పు మేరకు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చలో సేవ్ హైదరాబాద్

● సచివాలయం ముట్టడికి తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు

● అడ్డుకున్న పోలీసులు.. పలువురి ముందస్తు హౌస్ అరెస్ట్





అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు



సచివాలయం వద్ద కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని ఎత్తుకెళ్తున్న పోలీసులు

సచివాలయం సమీపంలో బీజేపీ ఎల్బీనగర్ ఇన్‌చార్జి రంగారెడ్డి, కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డిలను అడ్డుకుంటున్న పోలీసులు



సచివాలయం వైపు దూసుకువస్తున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిని అడ్డుకుంటున్న పోలీసులు

ఎల్బీనగర్/ మన్సూరాబాద్/ కొత్తపేట/ అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సేవ్ హైదరాబాద్ పరిట బీజేపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఎల్బీనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల బీజేపీ శ్రేణులు శుక్రవారం పెద్దఎత్తున సచివాలయానికి తరలివెళ్లారు. బీజేపీ కార్పొరేటర్లు, నాయకులతో పాటు పలువురు పార్టీ కార్యకర్తలను పోలీసులు సచివాలయం సమీపంలోనే నిలువరించి సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కొందరిని హౌస్ అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బీజేపీ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, పవన్‌కుమార్‌లను బేగంబజార్ పోలీస్ స్టేషన్‌కు, సరూర్‌నగర్ కార్పొరేటర్‌కు ఆకుల శ్రీవాణిఅంజన్‌ను నాంపల్లి పీఎస్‌కు తరలించారు. నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్‌ను హౌస్ అరెస్టు చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బీజేపీ సీనియర్ నాయకులను పోలీసులు గురువారం అర్ధరాత్రి ముందస్తు అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. సచివాలయ ముట్టడి కార్యక్రమంలో, ముందస్తు అరెస్టయిన వారిలో బీజేపీ సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు గోవర్ధన్, బీజేపీ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, పార్టీ నాయకులు రాజేష్, జంగారెడ్డి, సత్యనారాయణ, పాపయ్యగౌడ్, విష్ణుగౌడ్ తదితరులు ఉన్నారు.



నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్, బీజేపీ నాయకులను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

దేశ ఐక్యతకు చిహ్నం జాతీయ జెండా

● ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): దేశ ఐక్యతకు చిహ్నం జాతీయ జెండా అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. జాతీయ జెండా దేశ సార్వభౌమాధికారాన్ని, గౌరవాన్ని సూచిస్తుందని ఆయన అన్నారు. వనస్థలిపురం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నందకిషోర్ ఆధ్వర్యంలో 2,500 అడుగుల జాతీయ జెండాను శుక్రవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా వనస్థలిపురంలోని పలు కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. దేశ గొప్పదనాన్ని జాతీయ జెండా ప్రదర్శనతో నిరూపించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని గుండెల్లో నింపుకుని దేశ ప్రగతిని ప్రపంచ దేశాలను చాటి చెప్పాలని వారు పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ చేస్తున్న సామాజిక కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు.



జాతీయ జెండా ప్రదర్శనలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా తదితరులు

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, మాజీ కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి, చింతల రవికుమార్, ఇన్‌స్పెక్టర్ మహేష్, జేసీఐ అధ్యక్షులు సువిధ, నీరజ్, భాస్కర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలంలో అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి

● జిల్లా పంచాయతీ అధికారికి స్థానికుల వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా అవసరాల కోసం వదిలేసిన పార్కు స్థలంలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని స్థానికులు అధికారులను కోరారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారికి గడ్డం కుమార్ వినతిపత్రం అందజేశారు. అనంతరం కుమార్ మాట్లాడుతూ అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలో కొన్నేళ్ల క్రితం శ్రీమిత్ర పేరుతో రియల్ వ్యాపారులు లేఅౌట్ చేశారని తెలిపారు. అందులో 10 శాతం స్థలాన్ని పార్కు నిర్మాణానికి వదిలేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పార్కు స్థలంలో అక్రమ ఇంటి నిర్మాణం కొనసాగుతుందని, దాన్ని వెంటనే ఆపివేయించాలని ఆయన అధికారులను కోరారు.



మజీద్‌పూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో గుజరాత్ విద్యాధికారుల బృందం

మజీద్‌పూర్ స్కూల్ భేష్

● కితాబిచ్చిన గుజరాత్ విద్యాధికారుల బృందం

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మజీద్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాగుందని గుజరాత్ విద్యాధికారులు కితాబిచ్చారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ జడ్పీహెచ్‌ఎస్‌ను గుజరాత్ విద్యాధికారులు శుక్రవారం సందర్శించారు. విద్యాధికారుల బృందానికి స్కూల్ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తరగతి గదులను, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లను వారు పరిశీలించారు. స్కూల్‌లో చేస్తున్న విద్యాబోధనను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొద్ది సేపు విద్యార్థులతో ముచ్చటించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా స్కూల్ అభివృద్ధిని ఉపాధ్యాయులు వారికి వివరించారు. అనంతరం గుజరాత్ మహిళ విద్యాధికారులు బతుకమ్మ ఆడారు. డీఈవో సుశీందర్‌రావు, సీఎంవో జోసఫ్, ఏఎంవో జయచంద్రారెడ్డి, రంగారెడ్డి సీఎంవో వెంకటేశ్వర్లు, ఎంఈవో జగదీశ్వర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం రమేష్, మజీద్‌పూర్ స్కూల్ హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి, మహేష్, అమ్మఆదర్శ కమిటీ చైర్మన్ నాగమణి, జిలానీ పాల్గొన్నారు.



బలిజగూడలో పశువుల కొట్టాన్ని ప్రారంభిస్తున్న రంగారెడ్డి జడ్పీ డిప్యూటీ సీఈఓ రంగారావు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● రంగారెడ్డి జడ్పీ డిప్యూటీ సీఈవో రంగారావు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రంగారెడ్డి జడ్పీ డిప్యూటీ సీఈఓ రంగారావు అన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన "పనుల జాతర-2025" కార్యక్రమాన్ని శుక్రవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో రంగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కవాడిపల్లిలో డ్వాక్రా భవనం వద్ద నూతన ఇంకుడుగుంతకు శంకుస్థాపన చేశారు. బలిజగూడలో నూతనంగా నిర్మించిన పశువుల కొట్టాన్ని ఎంపీడీఓ శ్రీవాణితో కలిసి ఆయన ప్రారంభించారు. ఉపాధి హామీ పథకంలో 100 రోజుల పని పూర్తి చేసిన కూలీలను సన్మానించారు. అనంతరం రంగారావు మాట్లాడుతూ, జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకుని లబ్ధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీఓ మధుసూదనాచారి, ఏపీఓ సుధాకర్, టీఏ శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్స్, పంచాయతీ కార్యదర్శులు రమేష్, షేక్ రహీంపాషా, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి'

కొత్తపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో బీసీలకు యాభై శాతం రిజర్వేషన్లు కల్పించాలని, రిజర్వేషన్లు సాధించే వరకు ఉద్యమం కొనసాగుతుందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ్‌నాయుడు తెలిపారు. సమితి ముఖ్య నాయకులు కొత్తపేట న్యూనాగోల్‌లోని ప్రజా సంఘాల భవనం ఎస్ ఏ డాంగే భవన్‌లో శుక్రవారం సమావేశమయ్యారు. రాజ్యాంగ బద్ధమైన ఇతర హక్కుల కోసం క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని వారు అన్నారు. సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి కుమారస్వామి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉస్మాన్‌గంజ్‌లో సమస్యలు పరిష్కరించాలి

ఓల్డ్‌మలక్‌పేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉస్మాన్‌గంజ్ మార్కెట్‌లోని సమస్యలను పరిష్కరించాలని కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు అధికారులను కోరారు. ఈ మేరకు మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి చిలక నర్సింహారెడ్డిని శుక్రవారం కలిశారు. ఉస్మాన్‌గంజ్ మార్కెట్‌లో వరదనీరు వెళ్లేలా శాశ్వత పరిష్కారం చేపట్టాలని, మార్కెట్‌లో కొత్త భవనాన్ని నిర్మించాలని కోరారు. అందుకు నర్సింహారెడ్డి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

కొత్తపేట నూతన హెచ్‌ఎంగా నర్సింహ

కొత్తపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన ప్రధానోపాధ్యాయులుగా నర్సింహ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన చౌటుప్పల్ మండలం తంగడపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేశారు. ఆయనను కొత్తపేట జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు సాదారంగా ఆహ్వానించి శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిపారు.

వంట గ్యాస్ లీకై.. అగ్ని ప్రమాదం

● ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ ఆర్థిక సాయం



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ తిరుమల్‌రెడ్డి

హయత్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో అగ్ని ప్రమాదం జరిగి ఇంట్లోని వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఈ సంఘటన గురువారం రాత్రి హయత్‌నగర్ డివిజన్ రంగనాయకుల గుట్ట కాలనీలో జరిగింది. పోలీసులు, ఫైర్ ఆఫీసర్ యాదగిరి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి పామిరెడ్డిపల్లికి చెందిన కందనమోని శివకుమార్ ఆరు సంవత్సరాలుగా కుటుంబ సభ్యులతో హయత్‌నగర్ డివిజన్ రంగనాయకుల గుట్ట కాలనీలో అద్దెకు నివాసం ఉంటున్నాడు. గురువారం రాత్రి కొత్త గ్యాస్ సిలిండర్ పెట్టి వంట చేసే క్రమంలో గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం సంభవించింది. ఇంట్లోని ఎలక్ట్రానిక్ వస్తువులు, దుస్తులు, ఇతర వస్తువులు కాలి బూడిదయ్యాయి. అప్రమత్తమైన శివకుమార్ ఇంట్లో ఉన్న అందరిని బయటకు తీసుకువచ్చి వారి ప్రాణాలను కాపాడాడు. ఈ ప్రమాదంలో ఆయన కుడి చేతికి తీవ్రమైన గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేయడంతో పాటు మంటలను ఆర్పివేసే ప్రయత్నం చేశారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్థానిక బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ ద్వారా తక్షణ సాయంగా రూ.పదివేలు అందించారు. అంతకు ముందు హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ. 5వేలు అందించారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

● అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, ఏసీపీ కాశీరెడ్డి

హయత్‌నగర్/ సరూర్‌నగర్ ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సామరస్యం, సమన్వయంతో వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎల్బీనగర్ అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశీరెడ్డి మండప నిర్వాహకులకు సూచించారు. హయత్‌నగర్‌లోని ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో శుక్రవారం డీసీపీ కోటేశ్వర్‌రావు, మీర్‌పేట్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం రాత్రి పోలీసులు వేర్వేరుగా సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ, భక్తి శ్రద్ధలతో వినాయక నవరాత్రులు జరుపుకోవాలని సూచించారు. మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. మండపాల వద్ద డీజేలు పెట్టకూడదన్నారు. మండపాల ఏర్పాటు, విగ్రహ ఎత్తు, నిమజ్జన సమయం, ఇతర వివరాలను స్థానిక పోలీసులను ఇవ్వాలని సూచించారు. అనంతరం మండపాల నిర్వాహకుల సందేహాలకు అదనపు డీసీపీ సమాధానం చెప్పారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్, డీఐ సంతోష్‌కుమార్, ఎస్‌ఐలు నరసింహ, వెంకట్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రాజేశ్వర్, అరుణ్, వనస్థలిపురం సీఐ శంకర్‌కుమార్‌నాయక్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు

వరలక్ష్మీ నమోస్తుతే

శ్రావణ చివరి శుక్రవారం భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ఎల్బీనగర్/ కొత్తపేట/ మన్సూరాబాద్/ చాదర్‌ఘాట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవార్లను దర్శించుకునేందుకు ఆలయాలకు భక్తులు బారులుతీరారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కొత్తపేటలోని అష్టలక్ష్మీ దేవాలయంలో చివరి శుక్రవారం ఉదయం 108 కలశాలతో అభిషేకం, తామర పూలతో సహస్రనామార్చన నిర్వహించారు. యాగశాలలో గోపూజ నిర్వహించారు. అనంతరం సామూహిక లక్ష్మీనారాయణ వ్రతము చేశారు. పురాతన భక్తాంజనేయస్వామి, ఎస్ఆర్ఎల్ కాలనీలో ఆంజనేయస్వామి ఆలయాల్లో అర్చనలు, అభిషేకాలు చేయించారు. స్నేహపురి పద్మావతీగోదా సమేత వేంకటేశ్వరాలయంలో శ్రీవారికి, అమ్మవార్లకు అష్టోత్తర శతకలశాభిషేకం చేశారు. కాశీ విశ్వేశ్వరాలయంలో రంగురంగుల చీరలతో ప్రత్యేక అలంకరణలో అన్నపూర్ణాదేవి దర్శనమిచ్చారు. నాగోల్ డివిజన్ మన్సూరాబాద్ సాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయంలోని అమ్మవారు విశేష పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని సంతోషిమాత ఆలయంలో మహిళలు సామూహిక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్లు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



సంతోషిమాత ఆలయంలో సామూహిక పూజలు చేస్తున్న మహిళలు



విశేష పుష్పాలంకరణలో దర్శనమిస్తున్న దుర్గాదేవి

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

● టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపూడి

కొత్తపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపూడి సూచించారు. రాచకొండ కమిషనరేట్ కుంట్లూరులోని జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో 500 మంది విద్యార్థులకు, వంద మంది బస్ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేకంగా రూపొందించిన వీడియోలను ప్రదర్శిస్తూ శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీటీఐ ఆర్ఎస్ఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ నర్సింహారావు, ఏఎస్ఐ సోమ్‌నాథ్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు హెల్మెట్ ప్రాధాన్యతను వివరిస్తున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి